
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం । 23 । ఏప్రిల్ । 2024



గీత దాటితే ఇక్కట్లే..
ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు, పార్టీల నాయకులు గీత దాటొద్దని ఎన్నికల సంఘం మార్గదర్శకాలు సూచిస్తున్నాయి.
8లో



పుస్తకం.. హస్తభూషణం
అభిరుచులు మారుతున్నా, అనేక మాధ్యమాలు అందుబాటులోకి వస్తున్నా పుస్తక పఠనంపై మాత్రం ఆసక్తి తగ్గడం లేదని చెబుతున్నారు.
8లో

గరిష్టం/కనిష్టం
40°/ 24°

వాతావరణం
జిల్లాలో మంగళవారం అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం నుంచి ఎండ మొదలై మధ్యాహ్నానికి మరింతగా పెరుగుతుంది.

న్యూస్‌రీల్

మానుకోటలో మూడు నామినేషన్లు



నామినేషన్ సమర్పిస్తున్న బీజేపీ అభ్యర్థి సీతారాంనాయక్

మహబూబాబాద్: మహబూబాబాద్ పార్లమెంట్ స్థానానికి సోమవారం ముగ్గురు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. అలాగే, స్వతంత్ర అభ్యర్థి రెండో సెట్ నామినేషన్ దాఖలు చేశారని అధికారులు తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ అద్వైత్‌కు మార్‌సింగ్‌కు అభ్యర్థులు నామినేషన్‌పత్రాలు అందజేశారు. బీజేపీ నుంచి అజ్మీరా సీతారాంనాయక్ నామినేషన్ దాఖలు చేయగా, యూసీసీఆర్‌ఐ (ఎంఎల్) పార్టీ అభ్యర్థి పగిడి ఎర్రయ్య, స్వతంత్ర అభ్యర్థిగా మైపతి అరుణ్‌కుమార్‌తో పాటు స్వతంత్ర అభ్యర్థిగా పాల్వంచ దుర్గ రెండో సెట్ నామినేషన్ సమర్పించారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

'తాండ్ర'కు బీ ఫామ్



వినోద్‌రావుకు బీ ఫామ్ అందజేస్తున్న శ్రీకాంత్, సత్యనారాయణ

ఖమ్మం మామిళ్లగూడెం: బీజేపీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు సోమవారం పార్టీ బీ ఫామ్ అందుకున్నారు. ఆయన ఖమ్మంలో బీజేపీ పార్లమెంట్ ప్రభారి శ్రీకాంత్, జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ బీ ఫామ్ అందజేశారు. ఈసందర్భంగా వినోద్ రావు మాట్లాడుతూ ఈసారి ఖమ్మంలో తన విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో నేడు చండీహోమం

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ కనకదుర్గ(పెద్దమ్మతల్లి) అమ్మవారి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా మంగళవారం చండీ హోమం నిర్వహించనున్నట్లు ఈఓ జి.సుదర్శన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హోమంలో పాల్గొనే భక్తులు రూ.2,516 చెల్లించి గోత్రనామాలు నమోదు చేసుకోవాలని కోరారు. సంప్రదాయ దుస్తులు మాత్రమే ధరించి రావాలని సూచించారు. కాగా, తలనీలాలు, చీరలు పోగు చేసుకోవడం, పూలదండల విక్రయం, ఫొటోలు తీసేందుకు ఈనెల 26న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టికెట్లు, వాల్‌పోస్టర్ల ముద్రణ, ఇతర సామగ్రి, పూలదండల సరఫరాకు కూడా వేలం ఉంటుందని, ఆసక్తి గల వారు 26వ తేదీ ఉదయం 11 గంటల్లోగా రూ.200 చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని వెల్లడించారు.

25 నుంచి 'ఓపెన్' పరీక్షలు

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలోని ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పరీక్షలు ఈనెల 25 నుంచి మే 2వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు డీఈఓ ఎం.వెంకటేశ్వరచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు రెండు విడతలుగా పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షలు కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లోని సెయింట్ మేరీస్, సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాల, బాబూక్యాంప్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రాల్లో నిర్వహించనుండగా 846 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. పాత కొత్తగూడెంలోని జెడ్పీ హైస్కూల్ (ఆనందఖని పాఠశాల), చుంచుపల్లి, బూడిదగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలతో పాటు బాబూక్యాంప్‌లోని లిటిల్ బర్డ్స్ పాఠశాల కేంద్రాల్లో నిర్వహించే ఇంటర్ పరీక్షలకు 978 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని వివరించారు. అభ్యర్థులు పరీక్ష సమయానికి గంట ముందే కేంద్రాల వద్దకు చేరుకోవాలని, ఉదయం పరీక్షకు 9.05 గంటల వరకు, మధ్యాహ్నం 2.35 గంటల వరకు మాత్రమే అనుమతిస్తామని పేర్కొన్నారు. ప్రతి సెంటర్ వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, వైద్య సిబ్బంది, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉంటాయని, మాల్‌ప్రాక్టీస్ జరుగకుండా సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామని వివరించారు. అభ్యర్థులకు ఏమైనా సందేహాలుంటే ఏసీజీఈ ఎస్.మాధవరావు(8919279238)ను సంప్రదించాలని సూచించారు.

నిబంధనలకు నీళ్లు..

చర్లలో ఏజెన్సీ చట్టాల ఉల్లంఘన

- నిషేధాజ్ఞలు బేఖాతర్, ఎడాపెడా ఇసుక తవ్వకం
- అక్షయ పాత్రల్లా మారిన ఇసుక స్టాక్ పాయింట్లు
- మాఫియాకు అధికార యంత్రాంగం వత్తాసు



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రభుత్వం విధించిన నిషేధాజ్ఞాలను ఇసుక మాఫియా ఏ కోశానా పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ ఆదేశాలకు వక్ర భాష్యాలు చెబుతూ లెక్కా పత్రం లేకుండా గోదావరి నుంచి ఇసుకను అక్రమంగా దోచేస్తున్నారు.

తవ్వకాలపై నిషేధం ఉన్నా..

గోదావరిలో ఇసుక తవ్వకాలపై ప్రభుత్వం రెండు నెలల క్రితం విధించిన నిషేధం అమల్లో ఉంది. స్టాక్ పాయింట్‌లో ఉన్న ఇసుకను మాత్రమే అమ్మాలి. కానీ చర్ల మండలంలో రెండు నెలలు గడిచినా స్టాక్ పాయింట్లలో ఇసుక అమ్మకం పూర్తి కాలేదు. నిత్యం లారీల్లో ఇక్కడి నుంచి ఇసుక తరలిపోతోంది. అయినప్పటికీ ఈ స్టాక్ పాయింట్‌లో ఇసుక అయిపోవడం లేదు. ప్రతీరోజు అక్షయ పాత్ర తరహాలో కొత్త ఇసుక రాశులు పుట్టుకొస్తూనే ఉన్నాయి. ఇక్కడ నిత్యం ఇసుక అమ్మకాలు సాగుతున్నా స్టాక్ పాయింట్‌లో కొరత అన్న పదమే వినిపించక పోవడానికి ప్రభుత్వ నిషేధాజ్ఞల ఉల్లంఘనే ప్రధాన కారణమని తెలుస్తోంది. ఇసుక అమ్ముకునేందుకు తమకు అనుమతులు ఉన్నాయంటూ భారీ యంత్రాలతో నది నుంచి ఇసుకను తోడేస్తున్నారు.

ఎవరికీ కనిపించడం లేదు

చర్ల మండల పరిధిలో గోదావరి తీరం వెంట సుబ్బంపేట, వీరాపురం, పెద్దిపల్లి, కొత్తపల్లిలో ఇసుక ర్యాంపులు ఉన్నాయి. ప్రభుత్వ నిషేధం అమల్లోకి రాగానే స్టాక్ పాయింట్‌లో ఇసుక అమ్మకం పూర్తయిన తర్వాత పెద్దిపల్లి, కొత్తపల్లి మినహా మిగిలిన చోట్ల ర్యాంపుల్లో కార్యకలాపాలు దాదాపుగా నిలిచిపోయాయి. కానీ పెద్దిపల్లి ర్యాంపుల్లో అక్షయ పాత్ర తరహాలో ఇప్పటికీ ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతూనే ఉన్నాయి. గోదావరి నుంచి ఇసుకను తీయొద్దనే ప్రభుత్వ నిషేధాన్ని పూర్తిగా గోదావరిలో కలిపేశారు. ఆఖరికి పెసా వంటి ఏజెన్సీ చట్టాలకు తూట్లు పొడుస్తూ లారీలు, ప్రొక్లెయినర్లు (జేసీబీ) వంటి భారీ యంత్రాలను రాత్రీ పగలు తేడా లేకుండా గోదావరిలోకి పంపిస్తున్నారు. నది నుంచి ఇసుకను ఎడాపెడా తోడేస్తున్నారు.

కన్నెత్తి చూడరు

చర్ల మండలంలో జరుగుతున్న ఇసుక దందాకు అధికార యంత్రాంగం అండదండలు దండిగా ఉన్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. స్టాక్ పాయింట్‌లో ఇసుక అమ్ముతున్నారనే ముసుగులో నది నుంచి నిత్యం భారీ యంత్రాలతో ఇసుకను తోడేస్తున్నా చూసీచూడనట్టుగా ఇక్కడి అధికారులు వ్యవహరిస్తున్నారు. ప్రతీ రోజు వందల సంఖ్యలో ఇసుక లారీలు ఇటు భద్రాచలం, అటు వెంకటాపురం మీదుగా రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకున్న పాపాన పోవడం లేదు. గిరిజనుల హక్కులకు రక్షణగా ఉన్న చట్టాలను అమలు చేయించాల్సిన అధికారులు అందుకు భిన్నంగా మిన్నకుండిపోతున్నారు.

నిబంధనలు ఇలా

కాగితాలపై కనిపించే నిబంధనలు ఒకలా ఉంటే , క్షేత్రస్థాయిలో వాటి అమలు తీరు మరోలా ఉంటోంది. చర్ల మండలం ఏజెన్సీ పరిధిలోకి వస్తుంది. ఇక్కడ గిరిజనుల రక్షణ కోసం పెసా చట్టాన్ని అమలు చేయాల్సి ఉంది. దీని ప్రకారం ఇక్కడున్న ప్రకృతి వనరులపై తొలి హక్కు గిరిజనులకే దక్కుతుంది. ఈ క్రమంలో గిరిజనులకు ఎక్కువ లబ్ధి జరిగేలా పనులు జరగాలి. యంత్రాలను ఉపయోగించి తక్కువ సమయంలో ఎక్కువ ఇసుకను తోడేందుకు వీలు లేదు. స్థానిక గిరిజనులకు ఎక్కువ రోజులు ఉపాధి దొరికేందుకు వీలుగా మానవ శక్తితోనే ఇసుక తవ్వకాలు చేపట్టాలి. అంతేకాదు.. ఇసుక క్రయవిక్రయాలు, తోడటం వంటి పనులు నిర్వహించేందుకు గిరిజనులతోనే సొసైటీలు ఏర్పాటు చేయాలి.

రామయ్యకు వైభవంగా వసంతోత్సవం

నేటితో ముగియనున్న బ్రహ్మోత్సవాలు



వసంతోత్సవంలో సీతారామచంద్రస్వామి

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న వసంత పక్ష ప్రయుక్త నవాహ్నిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగియనున్నాయి. శ్రీరామనవమి అనంతరం నూతన వధూవరులైన సీతారాములకు వసంతోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలో సోమవారం ఈ వేడుకను వైభవంగా జరిపించారు. మేళతాళాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామివారి ఉత్సవ మూర్తులను అంతరాలయం నుంచి ప్రత్యేకంగా అలంకరించిన బేడా మండపంలోని నిత్యకల్యాణ వేదికపై కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం తదితర పూజలు చేసిన అర్చకులు.. పసుపులోకి లక్ష్మీదేవిని ఆవాహనం చేశారు. తొలుత మూలమూర్తులకు, అనంతరం లక్ష్మీ అమ్మవారికి, ఆండాళు అమ్మవారికి, ఆంజనేయస్వామి వార్లకు, చివరగా ఉత్సవమూర్తులకు వసంతం చల్లారు. నూతన వధువరులైన సీతా, రామయ్యను ఎదురెదురుగా ఉంచి జరిపిన ఈ క్రతువు భక్తులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా వసంతోత్సవ విశిష్టతను వేద పండితులు వివరించారు. భక్తులపై స్వామివారి వసంతాన్ని చల్లి ఆశీర్వదించారు. కాగా, చివరి రోజైన మంగళవారం చక్రతీర్థం, సాయంత్రం పూర్ణాహుతి, ధ్వజావరోహణం, ద్వాదశ ప్రదక్షిణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. బుధవారం నుంచి స్వామివారి నిత్యకల్యాణాలు పునఃప్రారంభం కానున్నాయి.

రామయ్య సన్నిధిలో పోలీస్ ఉన్నతాధికారులు



ఆలయంలో డీజీపీ, అధికారులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని పోలీస్ ఉన్నతాధికారులు సోమవారం దర్శించుకున్నారు. డీజీపీ రవిగుప్తా, ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీపీ శివధర్ రెడ్డి, సీఆర్‌పీఎఫ్ డీజీ శబరి, ఐజీ సుమతి, జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ తదితరులు ఆలయానికి చేరుకోగా, అర్చకులు స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పండితులు వేదాశీర్వచనం చేసి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు విజయరాఘవన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ధాన్యంలో తేమ శాతం 17లోపే ఉండాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న బాబూరావు

పాల్వంచరూరల్ : కొనుగోలు కేంద్రాల్లో విక్రయించే ధాన్యంలో తేమ శాతం 17 లోపే ఉండేలా రైతులు జాగ్రత్త పడాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.బాబురావు అన్నారు. మండల పరిధి సోములగూడెంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు కొనుగోలు కేంద్రాల్లో విక్రయానికి తీసుకొచ్చే ధాన్యంలో తాలు, పొట్టు లేకుండా శుభ్రం చేయాలని సూచించారు. పట్టాదారు పాస్ పుస్తకం లేని రైతులు 50 క్వింటాళ్ల లోపు అయితే ఏఈఓ నుంచి, అంతకు మించి అయితే ఏఓ నుంచి సర్టిఫికెట్ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కొత్తగూడెం సహాయ వ్యవసాయ అధికారి డి.రమేష్, రవికుమార్, శంకర్, సీఈఓ లక్ష్మీనారాయణ, ఏఈఓ సత్యం పాల్గొన్నారు.

ఏకలవ్య మోడల్ స్కూళ్లలో ప్రవేశానికి పరీక్ష

భద్రాచలంటౌన్: ఉమ్మడి జిల్లాలోని ఏకలవ్య మోడల్ సంక్షేమ విద్యాలయాల్లో 6వ తరగతిలో ప్రవేశాలకు ఈనెల 28న పరీక్ష నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ తెలిపారు. ఈనెల 28న ఉదయం 10.30 గంటల నుంచి 12.30 వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు https://tsemrs.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్షల నిర్వహణకు భద్రాద్రి జిల్లాలో మూడు, ఖమ్మం జిల్లాలో ఒక కేంద్రం ఏర్పాటు చేసినట్లు పీఓ తెలిపారు.

అంతర్జాతీయ క్రికెట్ పోటీలకు ఎంపిక

ఆర్థిక సాయం చేయాలని వేడుకోలు



భూక్యా తులసీనాయక్

జూలూరుపాడు: నేపాల్ దేశంలోని టోకరా ప్రాంతంలో జరిగే అంతర్జాతీయ క్రికెట్ టోర్నమెంట్‌కు జూలూరుపాడు మండలం కొమ్ముగూడెం గ్రామానికి చెందిన భూక్యా తులసీనాయక్ ఎంపికయ్యాడు. మార్చి 22, 23, 24 తేదీల్లో హైదరాబాద్‌లోని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో అండర్–19 క్రికెట్ పోటీలు జరిగాయి. మహారాష్ట్ర – తెలంగాణ జట్ల మధ్య జరిగిన క్రికెట్ పోటీలో తులసీనాయక్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. దీంతో మే 16వ తేదీన నేపాల్‌లో జరిగే ఇంటర్నేషనల్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఇండియా టీమ్‌లో ఆడేందుకు తనను ఎంపిక చేశారని తులసీనాయక్ విలేకరులకు తెలిపాడు. ఈ అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌ల్లో ఆడేందుకు రూ. 50 వేలు అవసరమని, పేద కుటుంబానికి చెందిన తాను అంత డబ్బు సమకూర్చుకోవడం కష్టమని వాపోయాడు. రెండేళ్ల క్రితమే తన తండ్రి లోకా మృతిచెందాడని, తల్లి సుజాత అనారోగ్య సమస్యతో బాధపడుతోందని చెప్పాడు. ఇంటర్నేషనల్ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు తనకు ఆర్థిక సాయం చేయాలని దాతలకు విజ్ఞప్తి చేశాడు. ఆర్థిక సాయం అందించేవారు 95737 38199 నంబర్‌కు ఫోన్ పే చేయాలని కోరుతున్నాడు.

పాలిసెట్ దరఖాస్తు గడువు పొడిగింపు

సింగరేణి(కొత్తగూడెం): ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించే పాలిసెట్‌కు దరఖాస్తు గడువు పొడిగించినట్లు కొత్తగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, పాలిసెట్ కన్వీనర్ బి.నాగముని నాయక్ తెలిపారు. అపరాధ రుసుము లేకుండా దరఖాస్తు చేసుకునే గడువు సోమవారం ముగియగా, ఈనెల 28 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయని పేర్కొన్నారు. అలాగే, రూ.100 జరిమానాతో 30వ తేదీ వరకు, రూ.300 అపరాధ రుసుముతో మే 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అయితే, పరీక్ష మాత్రం యథావిధిగా మే 24న జరుగుతుందని ఆయన వెల్లడించారు. ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలని సూచించారు.

'అమ్మ'తో మౌలిక వసతులు

- పాఠశాలల్లో టాయిలెట్లు, విద్యుత్, అదనపు గదుల కల్పన
- జిల్లాకు రూ. 21.46కోట్లు నిధులు
- పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చని అమ్మ ఆదర్శ కమిటీలు

అశ్వారావుపేట : గ్రామీణ ప్రాంతాల్లోని బాలికలను ప్రభుత్వ పాఠశాలలకు పంపేందుకు తల్లిదండ్రులు వెనుకాడుతుంటారు. ముఖ్యంగా యుక్త వయసున్న బాలికలను టాయిలెట్లు లేని పాఠశాలలకు పంపేందుకు వారు ముందుకు రారు.. బాలికలు కూడా బడికి వెళ్లేందుకు నిరాకరిస్తుంటారు. ఈ సమస్యను పలువురు ఉపాధ్యాయులు ప్రభుత్వానికి నివేదించడంతో గత ప్రభుత్వం 'మన ఊరు – మన బడి' కార్యక్రమం చేపట్టింది. దీనికి ప్రజల భాగస్వామ్యం కావాలంటూ నిధుల సమీకరణకు చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. దాతల స్పందన అంతంత మాత్రంగానే ఉండడంతో లక్ష్యం నెరవేరలేదు. ఇక రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. పాత ప్రతిపాదనలను పక్కన పెట్టి ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించింది. వీటిలో అత్యంత ప్రాముఖ్యమైన బాలికల టాయిలెట్లు, అదనపు గదులు, మైనర్ రిపేర్లు, విద్యుద్దీకరణలకు మండల స్థాయి నుంచి పంపిన ప్రతిపాదనలను ఆమోదిస్తూ జిల్లాలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించింది. దీని ప్రకారం జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేయాలని అన్ని మండలాల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు అన్ని మండలాల ఇంజనీరింగ్ అధికారులు.. వీఓ అధ్యక్షులు, పాఠశాల హెచ్‌ఎంలతో సమావేశాలు నిర్వహించారు. కాగా మంగళవారం పాఠశాలలకు చివరి పనిదినం కావడంతో పాటు ఈ రోజే కమిటీల ఏర్పాటు, ఫొటో అప్‌లోడ్ ప్రక్రియలను పూర్తి చేయాల్సి ఉంది. అయితే ఇవన్నీ సకాలంలో పూర్తయ్యేనా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇక వేసవి కాలంలో ఎలక్ట్రికల్, శానిటేషన్, ప్లంబింగ్ కార్మికులకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. మరి చేతిలో చిల్లిగవ్వ లేకుండా వీవో సంఘాల ద్వారా పనులు చేయించడం ఎలా సాధ్యమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మంగళవారం సాయంత్రానికి జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో పనికి ముందు పరిస్థితిని ఫొటోలతో వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. అయితే ఇప్పటికే కొన్ని పాఠశాలలు వీటిని అప్‌లోడ్ చేసినా.. ఆయా పాఠశాలల కమిటీల ఖాతాల్లో అడ్వాన్స్‌గా 25 శాతం నిధులు జమ కాలేదు.

సెలవుల్లోనే పనులు పూర్తి చేయాలి



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): వేసవి సెలవులు ముగిసే వరకు జిల్లాలోని అమ్మ ఆదర్శ పాఠశాల పథకం ద్వారా ఎంపికైన అన్ని పాఠశాలల్లో మరమ్మతులు పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అధికారులను ఆదేశించారు. నూతనంగా ఏర్పడిన అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలతో పని చేయించే విధానంపై సోమవారం ఆమె కలెక్టరేట్ నుంచి ఆయా శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో 643 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా మంజూరైన పనులు బుధవారం ప్రాంభించి మే నెలాఖరు వరకు పూర్తి చేసేలా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని, అన్ని శాఖలు సమన్వయంతో తమకు అందజేయాలని అన్నారు. కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలల్లో తాగునీరు, తరగతి గదుల్లో చిన్న చిన్న మరమ్మతులు, టాయిలెట్లు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తదితర సమస్యలను గుర్తించాలని సూచించారు. ప్రతీ పనిని మొదలు పెట్టే ముందు, పూర్తయిన తరువాత ఫొటోలు యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. జాతీయ బ్యాంకులలో కమిటీల ఖాతాలు ప్రారంభించాలని చెప్పారు. ప్రతిరోజు పనుల పురోగతిపై నివేదికలు అందజేయాలని ఆదేశించారు. అలాగే గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఓ విద్యాచందన, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈఓ వెంకటేశ్వరాచారి, ఆర్‌అండ్‌బీ డీఈ నాగేశ్వరరావు, మున్సిపల్ డీఈ రవికుమార్, మెప్మా డీఈ రాజేష్, సెర్ప్ డీపీఎం నాగజ్యోతి పాల్గొన్నారు.

గాలి, వానతో భారీ నష్టం



కరకగూడెంలో ఎగిరిపోయిన ఇంటి పైకప్పు రేకులు



కొత్తగూడెంలో నేలకూలిన విద్యుత్ స్తంభాన్ని పరిశీలిస్తున్న సిబ్బంది

- జిల్లాలో సరాసరి వర్షపాతం 13.6 మి.మీ.
- దెబ్బతిన్న వరి, మొక్కజొన్న, జొన్న పంటలు
- 285 మంది రైతులకు చెందిన 679 ఎకరాల్లో పంటలకు నష్టం
- తెగిన విద్యుత్ లైన్లు, కూలిన స్తంభాలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో వర్షం, గాలి, దుమారాలతో విద్యుత్ శాఖకు, పంటలకు నష్టం వాటిల్లింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను అకాల వర్షం ఆగమాగం చేసింది. వరి, మొక్కజొన్న, జొన్న పంటలకు తీవ్ర నష్టం జరిగింది. జిల్లాలో 13.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. పినపాక మండలంలో అత్యధికంగా 61.4 మి.మీ వర్షపాతం కురిసింది. కరకగూడెంలో 11, చర్లలో 2, దుమ్ముగూడెంలో 8.2, అశ్వాపురంలో 6.2, మణుగూరులో 3.2, ఆళ్లపల్లిలో 2, గుండాలలో 1.6, ఇల్లెందులో 28, టేకులపల్లిలో 56.4, జూలూరుపాడులో 0.6, చుంచుపల్లిలో 44.8, సుజాతనగర్‌లో 10.8, కొత్తగూడెంలో 30.2, లక్ష్మీదేవిపల్లిలో 22, పాల్వంచలో 5, ములకలపల్లి మండలంలో 19.2 మి.మీ వర్షం కురిసింది.

670 ఎకరాల్లో పంటలకు నష్టం..

గాలి వాన బీభత్సానికి జిల్లాలో 285 మంది రైతులకు సంబంధించిన 670 ఎకరాల్లో పంటలకు నష్టం సంభవించింది. ఇందులో 188 మంది రైతులకు చెందిన 498 ఎకరాలల్లో వరి, 31 మంది రైతులకు సంబంధించి 68 ఎకరాల్లో జొన్న, 65 మంది రైతులకు చెందిన 103 ఎకరాల్లో మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. ఒక ఎకరంలో నువ్వుల పంటకు నష్టం వాటిల్లింది.

విద్యుత్ శాఖకు రూ 68 లక్షల నష్టం

గాలి దుమారానికి జిల్లాలోని పలు ప్రాంతాల్లో భారీ వృక్షాలు, కొమ్మలు విరిగి విద్యుత్ లైన్లపై పడడంతో అవి ధ్వంసమయ్యాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరగగా ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. జిల్లా వ్యాప్తంగా 278 స్తంభాలకు, 48 ట్రాన్స్‌ఫార్మర్లకు నష్టం వాటిల్లింది. దీంతో పలు మండలాల్లో సోమవారం మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మొత్తంగా విద్యుత్ శాఖకు రూ. 68 లక్షల నష్టం వాటిల్లిందని ఎస్ఈ రమేష్ తెలిపారు.

అంధకారంలో ఆస్పత్రి

- నిలిచిన రక్తశుద్ధి సేవలు
- పని చేయని జనరేటర్
- బాత్‌రూమ్‌ల్లోనూ నీళ్లులేని వైనం

కొత్తగూడెంరూరల్: జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రి అంధకారమయమైంది. ఆదివారం సాయంత్రం వచ్చిన భారీ గాలులు, వర్షంలో ఆస్పత్రి ఆవరణలోని విద్యుత్ స్తంభాలపై చెట్లు విరిగి పడ్డాయి. ఇక ఆస్పత్రిలో ఉన్న జనరేటర్‌కు టెక్నీషియన్ లేకపోవడంతో అది కూడా ఆన్ చేయలేదు. దీంతో పేషెంట్లు, సహాయకులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఉక్కపోతతో పేషెంట్లు సతమతం కాగా, సహాయకులు విసనకర్రలు, అట్ట ముక్కలతో ఊపుతూ కనిపించారు. సోమవారం ఉదయం కూడా ఎక్స్‌రే, స్కానింగ్, డయాలసిస్ సెంటర్, ల్యాబ్ పని చేయలేదు.

దయాలసిస్ బాధితుల అవస్థలు..

జిల్లా సర్వజన ఆస్పత్రిలో ఉన్న రక్త శుద్ధి కేంద్రంలో ప్రతీ రోజు 20 నుంచి 24 మంది కిడ్నీ వ్యాధిగ్రస్తులకు రక్తశుద్ధి చేస్తారు. ఆస్పత్రిలో ఆదివారం సాయంత్రం నుంచి విద్యుత్ సరఫరా లేకపోవడంతో రక్త శుద్ధి కేంద్రంలోని పేషెంట్లను ఖాళీ చేయించారు. ఇక్కడ నిత్యం షిఫ్టుల వారీగా ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు, రాత్రి 8 నుంచి అర్ధరాత్రి 1 వరకు, తిరిగి 1 నుంచి తెల్లవారు జామున 4 గంటల వరకు రక్తశుద్ధి చేస్తారు.

పెరిగిన ఓపీ సేవలు..

కలెక్టర్ ప్రియాంక ఆల ఆదేశాల మేరకు ఈ ఆస్పత్రిలో ఇటీవల ఓపీ సేవలు పెంచారు. ప్రస్తుతం నిత్యం ఔట్ పేషెంట్లు 500 మంది వరకు వస్తున్నారు. కాగా విద్యుత్ సరఫరా నిలిచిపోతే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడంలో ఆస్పత్రి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. సోమవారం సాయంత్రం వరకు కూడా విద్యుత్ సరఫరా పునరుద్ధరించకపోవడంతో పేషెంట్లతో పాటు ఆస్పత్రి సిబ్బంది సైతం తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఆస్పత్రిలోని వాష్ రూమ్‌ల్లోనూ నీటి సరఫరా లేక పేషంట్‌లు మల, మూత్ర విసర్జనకు తీవ్రంగా ఇబ్బంది పడాల్సి వచ్చింది. స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సోమవారం ఆస్పత్రిని సందర్శించి, పేషెంట్ల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సేవల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆస్పత్రి అధికారులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఆస్పత్రి వద్ద స్తంభంపై విరిగిపడిన చెట్టు



ఖాళీగా ఉన్న రక్తశుద్ధి కేంద్రం

క్లుప్తంగా

సొమ్ము స్వాహాపై విచారణ !

సాక్షి ఎఫెక్ట్..

దమ్మపేట : 'స్త్రీ నిధి సొమ్ము.. సీసీ స్వాహా?' శీర్షికతో ఆదివారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. స్త్రీ నిధి ఆర్ఎం సంపత్ సోమవారం దమ్మపేటలోని ఐకేపీ కార్యాలయానికి వచ్చి స్త్రీ నిధి సొమ్మును సొంత ప్రయోజనాలకు వాడుకున్న సంజీవని క్లస్టర్ సీసీ కృష్ణవేణిని విచారించినట్టు సమాచారం. ప్రస్తుతం స్త్రీ నిధికి చెల్లించాల్సిన రూ.మూడు లక్షల దుర్వినియోగం ఆరోపణలపై ఆరా తీసి, గ్రామ దీపికలను కూడా విచారించారని తెలిసింది. సదరు సీసీకి స్త్రీ నిధి డబ్బులు ఇచ్చినట్టు గ్రామ దీపికల వద్ద ఏమైనా ఆధారాలు ఉన్నాయా అని ప్రశ్నించినట్టు సమాచారం. కాగా ఈ విచారణపై వివరణ కోరేందుకు ఆర్ఎం, దమ్మపేట ఏపీఎం నాగేశ్వరరావును రెండుసార్లు ఫోన్‌లో సంప్రదించగా వారు స్పందించలేదు.

లక్ష్య సాధనకు సమష్టిగా కృషి చేయాలి

సింగరేణి డైరెక్టర్లు శ్రీనివాస్, వెంకటేశ్వరరెడ్డి

మణుగూరు టౌన్: సింగరేణి మణుగూరు ఏరియాలో నిర్దేశిత ఉత్పత్తికి కార్మికులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని డైరెక్టర్ (ఆపరేషన్స్, పా) ఎస్వీకే శ్రీనివాస్, డైరెక్టర్(పీ అండ్‌పీ) వెంకటేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం వారు పీకేఓసీ-2, పీకేఓసీ-4లో వ్యూ పాయింట్ వద్ద బొగ్గు ఉత్పత్తిని పరిశీలించారు. అనంతరం ఓసీ-2 నూతన సైట్ ఆఫీస్‌లోని కనకదుర్గ ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యాంత్రిక, శ్రామిక శక్తిని పూర్తిస్థాయిలో వినియోగించుకుని నిర్దేశిత వార్షిక లక్ష్యాన్ని అధిగమించాలని సూచించారు. కార్యక్రమంలో ఏరియా జీఎం దుర్గం రాంచందర్, ప్రాజెక్ట్ అధికారి లక్ష్మీపతిగౌడ్, అధికారులు వెంకటేశ్వర్లు, రమేశ్, వెంకట్రావ్, రాంబాబు, వీరభద్రుడు, రమణారెడ్డి, లింగబాబు, శ్రీనివాస్, షబ్బీరుద్దీన్, చిట్టా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడి తగ్గించేందుకు 'టెలీమానస్'

కొత్తగూడెంరూరల్: ఈ నెలలో పదో తరగతి, ఇంటర్ ఫలితాలు వెల్లడయ్యే అవకాశం ఉన్నందున విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి, భయాందోళనలను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం టెలీమానస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ శిరీష తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా సైకాలజిస్ట్‌లను నియమించిందని పేర్కొన్నారు. విద్యార్థులు ఎవరైనా తాము ఒత్తిడికి గురవుతున్నామని అనిపిస్తే 14416 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. సైకాలజిస్ట్‌లు తగు సూచనలు చేస్తారని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేషన్ డీలర్‌ను బెదిరించిన ఘటనలో కేసు నమోదు

పాల్వంచ : డబ్బులు ఇవ్వాలంటూ రేషన్ డీలర్‌ను బ్లాక్ మెయిల్ చేస్తున్న యూ ట్యూబ్ చానల్ విలేకరిపై పాల్వంచ పట్టణ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పట్టణంలోని బొల్లేరుగూడేనికి చెందిన రేషన్‌డీలర్ మానేపల్లి వెంకటేశ్వరరావును యూట్యూబ్ చానల్ రిపోర్టర్‌నంటూ జయంత్ అనే బెదిరిస్తూ డబ్బు డిమాండ్ చేస్తున్నాడు. తనకు రూ.30 వేలు ఇవ్వకుంటే బయటి నుంచి బియ్యం బస్తాలు తెచ్చి షాపు ముందు పడేసి ఫొటోలు, వీడియోలు తీసి పోలీసులకు పట్టిస్తానని బెదిరించసాగాడు. ఈ క్రమంలో వెంకటేశ్వరరావు రూ.24వేలు ఇచ్చాడు. మిగితా రూ.6వేలు కూడా ఇవ్వాలంటూ రాత్రి వేళల్లో సైతం వచ్చి భయభ్రాంతులకు గురిచేస్తుండడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు జయంత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.రాము తెలిపారు.

కారేపల్లి సంతగుడి ఉద్యోగిపై సస్పెన్షన్ వేటు

కారేపల్లి: దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యాన కారేపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం నిర్వహిస్తున్న వారాంతపు సంత జూనియర్ అసిస్టెంట్ పగడాల మోహన్‌కృష్ణపై సస్పెన్షన్ వేటు పడింది. ఈమేరకు దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంతారావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కారేపల్లి సంతలో అవకతవకలు జరుగుతున్నట్లు డీసీకి కొందరు ఫిర్యాదు చేయగా, ఆదివారం సంతను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈక్రమాన 60మేకలతో వెళ్తున్న వాహనాలను తనిఖీ చేయగా 23మేకలకే రుసుం చెల్లించినట్లు రశీదు ఉండడంతో రూ.4,500 జరిమానా విధించారు. ఈమేరకు విధులు సక్రమంగా నిర్వర్తించడం లేదని తేలడంతో జూనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేశారని ఈఓ నల్లమోతు శేషయ్య తెలిపారు. అయితే, ఉత్తర్వులను తీసుకునేందుకు ఆయన నిరాకరించడంతో రిజిస్టర్ పోస్టు ద్వారా పంపనున్నట్లు దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సమత పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్య

ఇల్లెందురూరల్: మండలంలోని తిలక్‌నగర్ గ్రామపంచాయతీ పూసపల్లి గ్రామంలో సకినాల సాహిత్ (30) సోమవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రేమ వివాహం చేసుకున్న సాహిత్ ఆమెతో ఏర్పడిన మనస్పర్థలు, కలహాల నేపథ్యంలో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నట్లు స్థానికులు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,174

■ పచ్చగా ఉండాలంటే...



ఎల్లో మిర్చి తీసుకొచ్చిన రైతుతో మాట్లాడుతున్న నామ

బీఆర్ఎస్ హయాంలో రైతులు పచ్చగా కళకళలాడారని.. ఇప్పుడు సాగు నీరు అందక పంటలు కోల్పోతున్నారని బీఆర్ఎస్ ఖమ్మం అభ్యర్థి నామ నాగేశ్వరరావు విమర్శించారు. ఖమ్మం మార్కెట్‌ను సోమవారం సందర్శించిన ఆయన రైతులు, హమాలీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రైతాంగానికి పెద్దపేట వేసిన కేసీఆర్‌కు మద్దతుగా తనను గెలిపించాలని కోరారు. మార్కెట్ మాజీ చైర్మన్ దోరేపల్లి శ్వేత, నాయకులు పాల్గొన్నారు.

– ఖమ్మం మయూరిసెంటర్

■ మా పాలనలోనే చల్లగా..



ప్రచారంలో బాగంగా సోడా చేస్తున్న వినోద్‌రావు

బీజేపీ అధికారంలోకి వచ్చాకే దేశమంతా ప్రజలు హాయిగా జీవిస్తున్నారని ఖమ్మం అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు తెలిపారు. ఏన్కూరులో ప్రచారం సందర్భంగా సోమవారం నిర్వహించిన రోడ్డుషోలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రజలందరికీ లబ్ధి జరిగిందని చెప్పారు. మరోమారు బీజేపీని గెలిపిస్తే యువతకు ఉపాధి, సామాన్యులకు విద్య, వైద్యం అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈమేరకు ఖమ్మం నుంచి తనను గెలిపించాలని కోరారు.

– ఏన్కూరు

గీత దాటితే ఇక్కట్లే..

లోక్‌సభ ఎన్నికల ప్రచారం నానాటికీ జోరందుకుంటోంది. ఈ నేపథ్యాన ఎవరు కూడా నిబంధనలు అతిక్రమించకుండా అధికార యంత్రాంగం డేగకళ్లతో నిఘా వేసింది. ఎక్కడ ఏం జరిగినా క్షణాల్లో స్పందించేలా చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం ఏర్పాటైన వివిధ రకాల బృందాలు తనిఖీలు ముమ్మరం చేశారు. కాగా, ఎన్నికల వేళ నిబంధనలపై కేంద్ర ఎన్నికల సంఘం పలు మార్గదర్శకాలను విడుదల చేసింది. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఆయా మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని సూచిస్తూ.. ఎవరు అతిక్రమించినా ఇబ్బంది పడాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యాన ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలపై కథనం. – ఖమ్మం సహకారనగర్



- ఎన్నికల మార్గదర్శకాలు పాటించడం తప్పనిసరి
- నియమ, నిబంధనలు జారీచేసిన కేంద్ర ఎన్నికల సంఘం
- ప్రచారం, విమర్శల్లో హద్దు దాటకుండా సూచనలు

సమావేశాలు

సమావేశాల నిర్వహణకు ముందుగానే లిఖితపూర్వకంగా పోలీసుల అనుమతి తీసుకోవాలి. నిషేధాజ్ఞలు, ఆంక్షలు ఉన్న ప్రదేశాల వివరాలు తెలుసుకుని ఆ ప్రదేశాలకు దూరంగా వేడుకలు ఏర్పాటుచేసుకోవాలి. సమావేశాల్లో మైక్‌లు, లౌడ్ స్పీకర్ల వినియోగానికి ముందస్తుగా అనుమతి తీసుకోవాలి. సమావేశానికి ఎవరైనా ఆటంకం కలిగిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలే తప్ప సొంతంగా చర్యలకు దిగొద్దు.

ఊరేగింపులు

ఊరేగింపు నిర్వహించాలనుకునే వారు ముందస్తుగానే పోలీసులకు తెలియచేయాల్సి ఉంటుంది. ఊరేగింపు మార్గంలో ఏమైనా నిషేధాజ్ఞలు ఉన్నాయో తెలుసుకోవాలి. ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా ఊరేగింపు చేపట్టాలి. ఎవరి దిష్టిబొమ్మలను దగ్ధం చేయొద్దు.

అధికార పార్టీ...

ఎన్నికల ప్రచారాన్ని అధికార పర్యటనలతో కలిపి నిర్వహించవద్దు. అధికార యంత్రాంగం, ప్రభుత్వ వాహనాలను వినియోగించరాదు. అలాగే, ప్రభుత్వ వసతిగృహాలపై ఏ ఒక్కరి పెత్తనం ఉండొద్దు. ప్రభుత్వ ఖర్చుతో మీడియాలో ప్రకటనలు ఇవ్వకూడదు. ఏ రకమైన గ్రాంట్లు, పేమెంట్లు కొత్తగా మంజూరు చేయరాదు. అలాగే, అభివృద్ధి పనులపై వాగ్దానాలు చేయకూడదు. నూతన భవనాలు, కార్యక్రమాలకు శంకుస్థాపన చేయొద్దు.

ప్రచారంలో వాహనాలు

ఎన్ని వాహనాలైనా ఎన్నికల ప్రచారానికి ఉపయోగించవచ్చు. అయితే, రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతి తీసుకోవాలి. ఒరిజనల్ అనుమతి పత్రం స్పష్టంగా కన్పించేలా వాహనానికి అంటించాలి. అనుమతి తీసుకున్న అభ్యర్థి మాత్రమే ఆ వాహనాన్ని వినియోగించాలి. రవాణా శాఖ చట్టానికి లోబడి వాహనాలకు అదనపు మంగులు సమకూర్చుకోవచ్చు. అయితే, విద్యాసంస్థలు, వారి మైదానాలను ప్రచారానికి వాడకూడదు. ప్రైవేట్ భూములు, భవనాలకు పోస్టర్లు అంటించాలంటే యజమాని లిఖితపూర్వక అనుమతి తీసుకొని రిటర్నింగ్ ఆఫీసర్‌కి అందించాలి. ప్రచార కరపత్రాలు, పోస్టర్లను ముద్రణాలయాల పేరు, చిరునామా ఉండాలి. ప్రచారంలో భాగంగా టోపీలు, కండువాలు ఇచ్చేందుకు అవకాశమున్నా వీటిని ఖర్చులో చూపించాలి. అయితే, చీరలు, చొక్కాలు, అభ్యర్థి ఫొటోలతో డైరీలు, క్యాలెండర్లు ప్రచురించరాదు. వాహనాల స్టెపినీ కవర్లపై కూడా మత సంబంధిత ఫొటోలు, అభ్యర్థి ఫొటోలు ఉండడానికి వీలు లేదు.

తాత్కాలిక కార్యాలయాలు

ప్రార్థనా స్థలాలు, పాఠశాలలకు, పోలింగ్ స్టేషన్లకు 200 మీటర్లకు వెలుపలే అభ్యర్థి కార్యాలయం ఏర్పాటుచేసుకోవాలి. కార్యాలయాలపై పార్టీ జెండా, బ్యానర్, పార్టీ చిహ్నాన్ని పెట్టుకోవచ్చు. రాత్రి 10గంటల తర్వాత, ఉదయం 6గంటల లోపు మైక్‌లు, లౌడ్ స్పీకర్లు వాడకూడదు. రాత్రి 10గంటల తర్వాత పబ్లిక్ మీటింగ్ ఏర్పాటు చేయొద్దు. ఎస్ఎంఎస్‌ల ద్వారా అభ్యంతకర వార్తలను ప్రసారం చేయొదు.

సాధారణ నియమాలు

- అభ్యర్థి కానీ పార్టీ నేతలు కానీ కులమత, భాషా విద్వేషాలను రెచ్చగొట్టేలా చేయొద్దు. విధానాలు, కార్యక్రమాలపై, గతంలో చేసిన పనులపైనే తప్ప వ్యక్తిగత జీవితంపై విమర్శలు ఉండకూడదు. కుల, మత ప్రాతిపదికపై ఓట్లు అడగకూడదు. ప్రార్థనా ప్రదేశాలను ఎన్నికల ప్రచారం కోసం ఉపయోగించవద్దు. ఓటు కోసం డబ్బులు ఇవ్వడం, బెదిరించడం నిషేధం. ఒక వ్యక్తి ఓటును మరో వ్యక్తి వేయడం చట్ట వ్యతిరేకం.
- వ్యక్తుల అనుమతి లేకుండా వాళ్ల భూమి, భవనాలను ప్రచారానికి ఉపయోగించరాదు. ఇతర పార్టీల ఎన్నికల ప్రచారం, సమావేశాలకు ఆటంకపర్చేలా వ్యవహరించొద్దు

ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్)

- మంత్రులు ఎన్నికల అధికారులను ఎక్కడకు కూడా పిలవడానికి వీలులేదు. ప్రైవేట్ పని కోసం వచ్చిన మంత్రిని ఏ అధికారి కలవకూడదు.
- వాహనాలను ఇంటి నుంచి తమ కార్యాలయానికి మాత్రమే ఉపయోగించాలి. పైలెట్ కార్లు ఎర్ర బుగ్గ కార్లు ఉపయోగించకూడదు. అధికార పార్టీ చేసిన పనులపై ఏర్పాటుచేసిన ప్రచార హోర్డింగ్‌లు తొలగించాలి. కొత్త పనుల ప్రారంభంపై నిషేధం ఉండగా.. ఇప్పటికే మొదలైన పనులు మాత్రం కొనసాగించవచ్చు. అలాగే, పూర్తయిన పనులకు చెల్లింపులు, ప్రకృతి వైపరీత్యాలు వస్తే సహాయక కార్యక్రమాలపై ఎలాంటి నిషేధం ఉండదు. అధికారిక కార్యక్రమాలకు హాజరైనా రాజకీయ ఉపన్యాసాలు చేయవద్దు.

నేడు యూత్ కాంగ్రెస్ సమావేశం

ఖమ్మం వన్‌టౌన్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యాన ఖమ్మం పార్లమెంటరీ స్థాయి యువజన కాంగ్రెస్ సమావేశాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు యువజన కాంగ్రెస్ జిల్లాయడ్లపల్లి సంతోష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఖమ్మంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఉదయం 10.30గంటలకు మొదలయ్యే ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జ్‌లు సురభి ద్వివేది, ఖలీద్ మహ్మద్, రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, జోనల్ ఇన్‌చార్జ్ జెషన్ అహ్మద్, పార్లమెంట్ ఇన్‌చార్జ్ నాగిరెడ్డి సందీప్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ మేరకు యువజన కాంగ్రెస్ కమిటీల బాధ్యులు, నాయకులు హాజరుకావాలని సంతోష్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు.

కాలుజారి పడి చిన్నారి మృతి

సింగరేణి కార్మికవాడలో విషాదం

ఇల్లెందు: రోజంతా హాయిగా ఆడుకుని.. అమ్మమ్మ పక్కన పడుకుని నిద్రించిన చిన్నారి తెల్లవారకుండానే తనువు చాలించిన విషాద ఘటన ఇల్లెందులో చోటు చేసుకుంది. పట్టణంలోని డీఎస్పీ ఆఫీస్ వెనుక లైన్ సింగరేణి క్వార్టర్లో నివాసం ఉంటున్న సింగరేణి సెక్యూరిటీ విభాగం జమేదార్ కామరాజు – ఝాన్సీ దంపతుల మనుమరాలు పెనుగొండ హానిక(5) ఆదివారం రాత్రి అమ్మమ్మ పక్కనే పడుకుంది. అర్ధరాత్రి సమయంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు లేచిన హానిక కాలు జారి వెల్లకిలా పడడంతో తలకు తీవ్ర గాయమైంది. కిందపడిన శబ్దం వినిపించగానే ఝాన్సీ లేచి చూసేసరికే చిన్నారి స్పృహ కోల్పోయింది. ఇంట్లో నిద్రిస్తున్న కామరాజును లేపగా ఆయన భయంతో పరుగులు తీసి చుట్టుపక్కల వారిని పిలిచి చూపించారు. అప్పటికీ చిన్నారి లేవకపోవడంతో వెంటనే సింగరేణి ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. హానిక తల్లి శ్రీలాస్య హైదరాబాద్‌లో 'లా'కోర్సు మూడో సంవత్సరం చదువుతోంది. దీంతో చిన్నారిని అమ్మమ్మ, తాతయ్య వద్ద ఉంచారు. చిన్నారి మృతితో కార్మికవాడలో విషాదం అలుముకుంది.



హానిక (ఫైల్)

15 రోజుల్లో చెవులు కుట్టించాలని..

ఐదేళ్లు నిండిన తర్వాత ఆ చిన్నారికి చెవులు కుట్టించి ఘనంగా ఫంక్షన్ చేయాలని, బంధువులు, స్నేహితులను ఆహ్వానించాలని ఝాన్సీ, కామరాజు కలలు కన్నారు. తమ కలలు కల్లలుగానే మారిపోయాయని, చెవులు కుట్టిద్దామనుకుంటే అందనంత దూరం వెళ్లిపోయిందని వారు రోదిస్తున్న తీరు అందరినీ కలిచివేసింది. శ్రీలాస్య – కిరణ్ దంపతుల ఏకైక కూతురు హానిక మృతి వారికి తీవ్ర శోకం మిగిల్చింది.

విద్యుదాఘాతంతో పాడి గేదెలు మృతి

అశ్వారావుపేటరూరల్: విద్యుదాఘాతంతో నాలుగు పాడి గేదెలు మృతి చెందిన ఘటన మండలంలోని సున్నంబట్టిలో చోటుచేసుకుంది. ఆదివారం రాత్రి వచ్చిన అకాల గాలివానతో విద్యుత్ వైర్లు తెగి కింద పడ్డాయి. కాగా సోమవారం ఉదయం వగ్గెల రాములమ్మకు చెందిన మూడు, మాడి నాగేంద్రరావుకు చెందిన ఒక పాడి గేదె మేత కోసం అటువైపు వెళ్లగా కిందపడిన విద్యుత్ వైర్లు తగిలి షాక్‌తో మృతి చెందాయి. ఒక్కో గేదె విలువ రూ.50 వేల వరకు ఉంటుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పశువైద్యురాలు స్వప్న ఆధ్వర్యంలో మృతి చెందిన గేదెలకు పోస్టుమార్టం నిర్వహించారు.



మృతి చెందిన గేదెలను చూపిస్తున్న రాములమ్మ

మద్యం షాపుల్లో చోరీ

సుజాతనగర్/అశ్వారావుపేటరూరల్ : మద్యం షాపుల్లో చోరీలు జరిగిన ఘటనలు సుజాతనగర్, అశ్వారావుపేటలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకున్నాయి. సుజాతనగర్‌లోని వైన్‌షాపు షెట్టర్ పగలగొట్టిన ఓ వ్యక్తి లోపలికి ప్రవేశించి రెండు మద్యం బాటిళ్లను ఎత్తుకెళ్లాడు. సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు నిందితుడిని గుర్తించే పనిలో ఉన్నారు. ఇక అశ్వారావుపేటలోని మహాలక్ష్మి వైన్స్‌లో షెట్టర్ తాళం పలు మద్యం సీసాలను అపహరించారు. వాటి విలువ సుమారు రూ.95వేలు ఉంటుందని షాపు యజమాని నాచుపల్లి మల్లికార్జున్ ఫిర్యాదు చేశాడని, ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీరాముల శ్రీను తెలిపారు.

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం

ములకలపల్లి: అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమైన ఘటన మండలంలోని రామాంజనేయపురంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దేవళ్ల వెంకటేష్ దంపతులు కూలీపనుల నిమిత్తం వేరే ప్రాంతానికి వెళ్లారు. కాగా, సోమవారం వారు నివాసం ఉంటున్న పూరిల్లుకు ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని మంటలు వ్యాపించాయి. స్థానికులు మంటలు ఆర్పడానికి ప్రయత్నిస్తుంగానే నిత్యావసరాలు, గృహోపకరణాలు పూర్తిగా కాలిపోయాయి.

21 కేజీల గంజాయి పట్టివేత

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని చెక్ పోస్టు వద్ద సోమవారం 21 కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా వస్తున్న ఇద్దరిని ఆపి తనిఖీ చేయగా వారి వద్ద గంజాయి ఉన్నట్లు గుర్తించారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించామని, నిందితులు ఏపీలోని తిరువూరుకు చెందిన వారని, సీలేరు నుంచి తిరువూరుకు తరలిస్తుండగా పట్టుబడ్డారని, గంజాయి విలువ రూ.5లక్షలు ఉంటుందని పట్టణ సీఐ సంజీవరావు వివరించారు.

చికిత్స పొందుతున్న కార్మికుడు మృతి

కొణిజర్ల: పంచాయతీ కార్యదర్శి వేధిస్తున్నాడని ఆరోపిస్తూ గతనెల 28న పురుగుల మందు తాగిన కార్మికుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మండలంలోని అంజనాపురానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ భూక్యా ప్రసాద్‌ను కార్యదర్శి పనిలోకి రానివ్వడం లేదని చెబుతూ పురుగుల మందు తాగగా ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించారు. ఆయన సోమవారం మృతి చెందగా, ప్రసాద్ కుటుంబాన్ని ఆదుకోవడంతో పాటు కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బంధువులు పోస్టుమార్టాన్ని అడ్డుకున్నారు. వైరా సీఐ సాగర్‌నాయక్, ఎస్ఐ శంకరరావు చేరుకుని ప్రసాద్ ఇచ్చిన హామీతో ఆందోళన విరమించారు.

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యం

మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బలరాం నాయక్

భద్రాచలంటౌన్: దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమని మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ అన్నారు. భద్రాచలంలో సోమవారం ఆయన డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీస్తోందని, తెలంగాణ ప్రజలు ఎలా మార్పు కోరుకున్నారో, దేశ ప్రజలు సైతం అదే మార్పును కోరుకుంటున్నారని తెలిపారు. ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేసి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే భద్రాచలం ఏజెన్సీ ప్రాంతాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పరిమి శ్రీనివాస్, టీపీసీసీ సభ్యుడు నల్లపు దుర్గాప్రసాద్, రవిశంకర్, చింతిర్యాల రవికుమార్‌, రసూల్, యశోద రాంబాబు, తమ్మళ్ల వెంకటేశ్వరరావు, తరుణ్ మిత్రా, ఎడారి ప్రదీప్, సుధీర్, సరిత, హసీనా, వసీమ, జయ, ఆశోక్‌కుమార్ పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న బలరాం నాయక్, పక్కన పొదెం, తెల్లం

పుస్తకం.. హస్తభూషణం

నేటికీ మంచి నేస్తాలే

- ఆన్‌లైన్ యుగంలో కూడా తగ్గని పఠనాసక్తి
- వెబ్‌సైట్లలోనూ అందుబాటులో పుస్తకాలు
- నేడు ప్రపంచ పుస్తక దినోత్సవం



సత్తుపల్లి గ్రంథాలయంలో పాఠకులు

ఉమ్మడి జిల్లాలో గ్రంథాలయాలు 43

పుస్తకాలు	4,98,303
డిపాజిటర్లు	31,755
పాఠకులు	11,85,392 మంది

సత్తుపల్లిటౌన్: పుస్తకం ఒంటరి తనాన్ని పోగొట్టే సాధనం.. మంచి, చెడులను చెప్పే సాధనం.. అందుకే చిరిగిన చొక్కా అయినా తొడుక్కో కానీ ఒక మంచి పుస్తకం కనుక్కో అన్నారు కందుకూరి వీరేశలింగం పంతులు. నా వద్ద ఏ మాత్రం డబ్బులు ఉన్నా వాటితో పుస్తకాలు కొంటాను.. మిగిలిన సొమ్ముతో తిండి, బట్టా సమకూర్చుకుంటాను అన్నారు ఇంకో మహానుభావుడు. నిజజీవితంలో పుస్తకాలకు ఉన్న విలువను చాటిచెప్పే వ్యాఖ్యలివి. అయితే గతంతో పోలిస్తే ఇప్పుడు పుస్తక పఠనంలో మార్పులు వచ్చినా.. ఎంచుకోవటంలో ప్రాధాన్యతలు మారినా పఠనాసక్తి మాత్రం తగ్గడం లేదు. నేడు (మంగళవారం) ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా కథనం.

విజ్ఞాన భాండాగారాలు

పుస్తకం మనకు తెలియని ఎన్నో విషయాలను ఎన్నో విషయాలను చెబుతుంది. వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడుతుంది. అందుకే పుస్తకాన్ని హస్తభూషణం అంటారు. ప్రస్తుతం అందరి చేతుల్లో ఇంటర్నెట్‌తో కూడిన సెల్‌ఫోన్లు వచ్చినా పుస్తకాలకు ఆదరణ తగ్గలేదనే చెప్పుకోవాలి. చదువుకునే పుస్తకాలు, చదివే సాధనాలు మారినా పఠనాసక్తి తగ్గలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇప్పుడంతా పోటీ పరీక్షలకే..

ఒకప్పుడు నవలలు, కథల పుస్తకాలను ఎక్కువగా చదివేవారు. లైబ్రరీల్లోనూ వీటికి డిమాండ్ ఉండేది. ముఖ్యంగా విప్లవ సాహిత్యం, దేశభక్తి, పౌరాణికం, డిటెక్టివ్ నవలలకు ఎందరో అభిమానులు ఉండేవారు. కొత్త పుస్తకాలు మార్కెట్‌లోకి వస్తే వెంటనే కొనేవారు. కానీ అలాంటి పుస్తకాలు కొనేవారు ఇప్పుడు అరుదుగానే ఉన్నారని చెప్పుకోవాలి. ప్రస్తుత యువత విజ్ఞానం, ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసం, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలకు పెద్దపీట వేస్తున్నారు. అందుకే నవలలు, కథల పుస్తకాలు ఏళ్ల క్రితం ముద్రించినవే లైబ్రరీల్లో కనిపిస్తున్నాయి.

విజయం వైపు..

ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో కొలువు సాధించటం కోసం యువత తీవ్రంగా కష్టపడుతున్నారు. ఈ క్రమంలో వారు పోటీ పరీక్షలపై దృష్టి సారించడంతో షాపులు, లైబ్రరీల్లో ఈ తరహా పుస్తకాలే అందుబాటులో ఉంటున్నాయి. అదే విధంగా విజయం వైపు ఎలా పురుగులు తీయాలనే పలు అంశాలను వివరిస్తూ లక్ష్యం, ఆశయాలు, నడవడిక అంశాలతో ముద్రించిన వ్యక్తిత్వ వికాస పుస్తకాలు తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో లభిస్తున్నాయి.

ఆన్‌లైన్‌లోనూ పుస్తకాలు

చేతిలో సెల్‌ఫోన్ ఉంటే చాలు ఆన్‌లైన్‌లో కావాల్సిన పుస్తకాలను ఈ–బుక్ ద్వారా చదివే వెసలుబాటు ఉండడంతో పఠనాసక్తి తగ్గడం లేదని చెబుతున్నారు. పోటీ ప్రపంచంలో లైబ్రరీకి వెళ్లలేక, పుస్తకాలను కొనలేక పలువురు ఈ–బుక్‌లో చదువుతూ విజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటున్నారు. కాగా, వేసవి సెలవుల్లో పిల్లలనుతల్లిదండ్రులు గ్రంథాలయాలకు పంపించి పఠనాసక్తి పెంపొందించాల్సిన అవసరముందని పలువురు సూచిస్తున్నారు. తద్వారా సెల్‌ఫోన్ నుంచి దూరం చేయవచ్చని నిపుణులు చెబుతున్నారు.

సెలవులంతా ఇక్కడే..



ప్రస్తుతం నేను ఆరో తరగతి చదువుతున్నా. స్కూల్‌కు వేసవి సెలవులు ఇచ్చారు. ఈ సెలవుల్లో లైబ్రరీలో పుస్తకాలు చదవాలని ఇప్పటికే నిర్ణయించుకున్నాను. ఇక్కడ ఉన్న కామిక్స్, స్టోరీ పుస్తకాలు, డిక్షనరీ పుస్తకాలు చదవాలని ఉంది.

– జి.లిఖిత్, సత్తుపల్లి

చిన్నప్పటి నుంచి..



గ్రంథాలయానికి వెళ్లి పుస్తకాలు చదవటం చిన్నప్పటి నుంచే అలవాటు. ప్రస్తుతం గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్నా. ఇక్కడ కావాల్సినన్ని పుస్తకాలు ఉన్నాయి. అన్నిరకాల పుస్తకాలే కాక చదువుకోవడానికి చక్కని వాతావరణం ఉంది.

– జె.రమ్య, సత్తుపల్లి

ఎస్సై పరీక్షల కోసం..



ఎస్సై పరీక్షల కోసం ప్రిపేర్ అవుతున్నా.. గ్రూప్స్‌కు సైతం దరఖాస్తు చేసుకున్నాను. ప్రతిరోజు కల్లూరు నుంచి సత్తుపల్లి లైబ్రరీకి వచ్చి చదువుకుంటున్నా. ఇంకా మరిన్ని పుస్తకాలు సమకూరిస్తే మంచిగా ప్రిపేర్ అయ్యే అవకాశం లభిస్తుంది.

– ఈ.గాయత్రి, కల్లూరు

30 ఏళ్లుగా ప్రతిరోజు..



నేను ముప్పై ఏళ్లుగా గ్రంథాలయానికి వస్తున్నా. దినపత్రికలు చదవడం నా దినచర్యలో ఒక భాగం. ఇంకా శ్రీరామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద సాహిత్యం చదువుతాను. తల్లిదండ్రులు పిల్లలను పుస్తక పఠనం వైపు మళ్లించాలి.

– కోడె వీరభద్రం, నాచారం, దమ్మపేట మండలం